క్లుప్తంగా

తహసీల్దార్‌కు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి


శ్రీదేవి

జగ్గంపేట: స్థానిక తహసీల్దార్ బి.శ్రీదేవికి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు ఆమె రాష్ట్ర రెవెన్యూ సర్వీస్ డిపార్టుమెంట్ నుంచి ఉత్తర్వులు అందాయి. డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన శ్రీదేవికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలిపారు.

లిబరేషన్ శ్రేణుల ర్యాలీ

ప్రత్తిపాడు: మండలంలోని తిరుమాలిలో దళితులపై జరిగిన దాడిని నిరసిస్తూ సీపీఐ (ఎంఎల్) కార్యకర్తలు బుధవారం ప్రత్తిపాడులో ర్యాలీ చేపట్టారు. స్థానిక లిబరేషన్ కార్యాలయం నుంచి నంది సెంటర్, మెయిన్ రోడ్డు, అల్లూరి జంక్షన్ మీదుగా అంబేడ్కర్ కళా మందిర్ వరకూ ర్యాలీ కొనసాగింది. అంబేడ్కర్ విగ్రహం వద్ద కొద్ది సేపు ధర్నా నిర్వహించారు. లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు, పార్టీ నాయకులు సుబ్బారావు, మాది నాగేశ్వరరావు, బోండి అబ్బాయి, చంటి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన

రౌతులపూడి: సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్‌ఐ అబ్దుల్ నబీ సూచించారు. స్థానిక సూర్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు బుధవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుతం వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం వంటి సామాజిక మాధ్యమాల ద్వారా పలువురు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు లోన్‌యాప్‌ల ద్వారా రుణాలు అందిస్తామని మెసేజ్‌లు పంపిస్తే నమ్మవద్దన్నారు. యువత సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు గజ్జనదొర, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు కృషి

తుని: ఎస్సీ వర్గీకరణ కోసం అందరూ సమష్టిగా పోరాడాలని ఎమ్మార్పీఎస్ తుని నియోజకవర్గ అధ్యక్షుడు పలివెల శివమణి పిలుపునిచ్చారు. తుని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం ఎమ్మార్పీఎస్ తుని శాఖ కార్యదర్శి తొమ్మండ్ర రమేష్ మాదిగ అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి సంఘ సమావేశం జరిగింది. ఈ నెల 6న తుని మండలం లోవకొత్తూరులో మాదిగ ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నామని, అందరూ హాజరు కావాలని శివమణి కోరారు. పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

కోటనందూరు: స్థానిక నాన్ భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఫిజియోథెరపిస్టు టీఎస్ఎస్ సోమేశ్వరరావు చిన్నారులతో వ్యాయామాలు చేయించారు. చిన్నారుల ఆరోగ్యంపై వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ శ్రీనివాస్ పరిశీలించారు. ఐఈఆర్పీలు నారాయణరావు, నాగ గోవిందు పాల్గొన్నారు.

ఏలూరులో టీడీపీ ఇంటింటా ప్రచారం

ప్రత్తిపాడు: మండలంలోని ఏలూరులో బుధవారం టీడీపీ శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలు, టీడీపీ మినీ మేనిఫెస్టోపై కరపత్రాలు పంపిణీ చేశారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు ప్రత్యేక శిబిరాలు


సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి ప్రసాదరావు

ప్రత్తిపాడు: ఓటు నమోదుకు ఈ నెల 4, 5 తేదీల్లో నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, బీసీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేఎస్‌వీ ప్రసాదరావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద రెండు రోజుల పాటు బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. అర్హత కలిగిన వారిని ఓటరుగా నమోదు చేసేందుకు రాజకీయ పార్టీల నాయకులు కృషి చేయాలని కోరారు. నియోజకవర్గంలోని 227 పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,09,543 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. సమావేశంలో ఏలేశ్వరం, శంఖవరం మండలాల తహసీల్దార్లు జి.చిన్నారావు, కె.సుబ్రహ్మణ్యం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను, బీజేపీ నాయకుడు శింగిలిదేవి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ అధరహో

- లాభసాటిగా మారిన సాగు
- ప్రోత్సాహకాలు అందిస్తున్న ప్రభుత్వం
- టన్ను పామాయిల్ గెలల ధర రూ.14,500
- తుని సబ్‌డివిజన్ పరిధిలో 928 ఎకరాల్లో సాగు


కాకరాపల్లిలో ప్రైవేటు సంస్థ కొనుగోలు చేసిన పామాయిల్ గెలలు

కోటనందూరు: మెట్ట ప్రాంత రైతులు సంప్రదాయ పంటలకు భిన్నంగా ఆయిల్‌పామ్ సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం భారీగా రాయితీలు ఇచ్చి ప్రోత్సహిస్తుండడంతో ఆయిల్ పామ్ సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు ఎక్కడికక్కడ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు మించి పామాయిల్ గెలలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో మెట్ట ప్రాంతమైన తుని నియోజకవర్గంలో ఏటా ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెరుగుతోంది.

పట్టించుకోని గత ప్రభుత్వాలు

సాధారణంగా వాణిజ్య పంటల సాగుతో రైతులు నష్టపోయే అవకాశాలు తక్కువగా ఉంటాయి. గత ప్రభుత్వాలు ఆయిల్ పామ్ సాగును పట్టించుకోకపోవడంతో నాలుగేళ్ల క్రితం వరకూ పామాయిల్ రైతులు నష్టాలు చవిచూశారు. కనీసం కూలీ డబ్బులు కూడా రాక పామాయిల్ తోటలు తొలగించిన పరిస్థితి ఎదురైంది. సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరువాత సరైన మద్దతు ధర దక్కడం, ప్రభుత్వం నుంచి భారీగా ప్రోత్సాహం లభిస్తుండడంతో రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించారు. ఇప్పటికే ఆయిల్‌పామ్ తోటలు సాగు చేసిన రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మూడేళ్లుగా గిట్టుబాటు ధర

తుని ఉద్యాన సబ్‌డివిజన్ పరిధిలోని తుని, కోటనందూరు, తొండంగి మండలాల్లో 928 ఎకరాల్లో రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు. ఆయిల్ పామ్ గెలలకు గత మూడేళ్లుగా రూ.20 వేల వరకూ పలికిన టన్ను ధర ప్రస్తుతం రూ. 14,500 పలుకుతోంది. రైతులకు ఇబ్బంది లేకుండా ప్రైవేటు సంస్థల ప్రతినిధులు ఎక్కడికక్కడ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పామాయిల్ గెలలు కొనుగోలు చేస్తున్నారు. కోటనందూరు మండలంలోని బొద్దవరం, అల్లిమూరు, కొత్తకొట్టాం, పాతకొట్టాం, బిళ్లనందూరు, భీమవరపుకోట, ఎస్సార్‌పేట గ్రామాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోంది.

ఎకరాకు 10 టన్నుల దిగుబడి

ఆయిల్ పామ్ సాగుకు ఎకరానికి అన్ని ఖర్చులు కలిపి రూ.50 వేల వరకూ పెట్టుబడి అవుతుందని, ఎకరానికి 10 టన్నుల వరకూ దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం టన్ను ధర రూ.14,500 వరకూ పలుకుతుండడంతో ఖర్చులు పోను రూ.లక్ష వరకూ ఆదాయం వస్తుందని వివరించారు. నాలుగేళ్ల క్రితం వరకూ టన్ను ధర రూ.6 వేల నుంచి గరిష్ఠంగా రూ.10 వేల వరకూ మాత్రమే పలికింది. గత నాలుగేళ్లుగా రూ.20 వేలు పలికిన ఆయిల్‌పామ్ ధర ప్రస్తుతం స్వల్పంగా తగ్గి రూ.14,500 పలుకుతోంది.

రైతులకు ప్రభుత్వ రాయితీలు

పామాయిల్ సాగు చేసిన నాలుగు సంవత్సరాల వరకూ ఆదాయం వచ్చే పరిస్థితి ఉండదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు ఇచ్చి రైతులను ఆదుకుంటోంది. ఎకరం పొలంలో మొక్కల కొనుగోలుకు రూ.27,600, నాలుగు సంవత్సరాల పాటు ఎరువులకు రూ.21 వేలు, అంతర పంటలకు రూ.21 వేల చొప్పున సహకారం అందిస్తోంది. ఫలసాయం దక్కే వరకూ ఉద్యానశాఖ అధికారులు రైతుకు సలహాలు ఇస్తున్నారు.

ఖర్చు తక్కువ

ఆయిల్ పామ్ సాగుకు నీటి ఎద్దడి బెడద ఉండదు. ఎటువంటి నేలలోనైనా ఈ సాగు చేసుకోవచ్చు. కూలీల అవసరం కూడా పెద్దగా ఉండదు. ఉద్యానశాఖ అధికారుల సూచనల మేరకు ఎరువులు, పురుగుమందుల యాజమాన్యాన్ని పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయి. వేరే వృత్తిలో ఉండి వ్యవసాయంపై ఆసక్తి కలిగిన వారికి ఈ పంట లాభదాయకంగా ఉంటుంది.

ఎకరాకు రూ.లక్ష ఆదాయం



నాలుగు ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశాను. ఎకరాకు రూ.50 వేల వరకూ పెట్టుబడి అవుతోంది. ఎకరాకు 10 టన్నుల దిగుబడి వస్తోంది. ప్రస్తుతం టన్ను ధర రూ.14,500 వరకూ పలుకుతోంది. అన్ని ఖర్చులు పోనూ ఎకరానికి రూ.లక్ష వరకూ ఆదాయం వస్తోంది. ప్రభుత్వం భారీగా రాయితీలు ఇచ్చి పామాయిల్ రైతులను ప్రోత్సహిస్తోంది.

నల్లమిల్లి గోవిందు,
పామాయిల్ రైతు, అప్పలరాజుపేట

రైతులకు భారీగా రాయితీలు



ఆయిల్‌పామ్ రైతులకు ప్రభుత్వం భారీగా రాయితీలు అందిస్తోంది. మొక్కల కొనుగోలు నుంచి ఫలసాయం వచ్చే వరకూ అంతర పంటల సాగు, ఎరువులకు రాయితీలు అందించి సహకరిస్తుంది. కనీస మద్దతు ధర కల్పనకు కృషి చేస్తుంది. ఆయిల్‌పామ్ సాగుతో కూలీలు, సాగునీటి సమస్యను అధిగమించి మంచి ఆదాయం పొందవచ్చు.

జీవీ లక్ష్మి, ఉద్యానశాఖ అధికారి, తుని సబ్‌డివిజన్

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలు సీజ్


హైవేపై ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్న సెబ్ అధికారులు

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్, లారీలను సీజ్ చేసినట్టు బుధవారం స్థానిక ఎస్‌ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. హైవేపై స్థానిక మినర్వా విద్యా సంస్థల సమీపంలోనూ, రాచపల్లి అడ్డరోడ్డు వద్ద ఐదు టన్నుల ఇసుకను రవాణా చేస్తోన్న ధర్మవరం గ్రామానికి చెందిన నక్కా సోమరాజును, లారీపై 30 టన్నుల ఇసుకను రవాణా చేస్తున్న తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం నరేంద్రపురం గ్రామానికి చెందిన వాసంశెట్టి శ్రీను అదుపులోకి తీసుకున్నామన్నారు. సీజ్ చేసిన వాహనాలు, నిందితులను ప్రత్తిపాడు ఎస్సైకు అప్పగించినట్టు సీఐ పి.అశోక్ తెలిపారు.

విస్తృతంగా ఎస్‌ఈబీ దాడులు

ప్రత్తిపాడు: స్థానిక ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) పరిధిలోని గ్రామాల్లో బుధవారం విస్తృతంగా దాడులు నిర్వహించినట్టు స్థానిక ఎస్‌ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. కిర్లంపూడి మండలం గెద్దనాపల్లిలో పరారీలో ఉన్న పాలిక రమణను అదుపులోకి తీసుకున్నామన్నారు. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో సారా స్థావరాలపై దాడి చేసి, సారా తయారీకి సిద్ధం చేసిన 100 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. సంఘటన స్థలం నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ కేసులో పరారైన సురుకుర్తి చక్రధర్, కందిపల్లి బుజ్జిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ అశోక్ తెలిపారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ధర్మవరంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

ప్రత్తిపాడు రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైఎస్సార్ సీపీ నేతలకు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని ధర్మవరంలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లకు ఎమ్మెల్యే దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కష్టించి పనిచేయాలన్నారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా తమ ప్రభుత్వం ప్రజలకు మంచి చేయడమే లక్ష్యంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుయుక్తులు పన్నినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీనే మళ్లీ విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు, పార్టీ జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ రామిశెట్టి చినబాబు, ఏపీ సాహిత్య అకాడమీ డైరెక్టర్ మారిశెట్టి శివకుమార్, అన్నవరం ట్రస్టు బోర్డు సభ్యుడు దోచిట్టిబాబు, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ శేరు వీరబాబు, మండల కో ఆప్షన్ సభ్యుడు గంగా మహాలక్ష్మీరావు, పార్టీ నాయకులు కొట్టేటి రాయుడు, లొండబాబు తదితరులు పాల్గొన్నారు.

సురక్షతో పేదలకు మెరుగైన వైద్యం


దొండవాకలో రోగులకు సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

తుని రూరల్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు అన్నారు. మండలంలోని దొండవాకలో బుధవారం గ్రామ సర్పంచ్ లంక లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం రోగులకు సురక్ష కిట్లను అందజేశారు. వైఎస్సార్ సీపీ జేసీఎస్ ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూ, ఎంపీటీసీ లంక పార్వతి, పార్టీ మండల కన్వీనర్ దుంగల నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పోతల రమణ, నాయకులు చిటికెల వరహాలబాబు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో జగనన్న ఆరోగ్య సురక్ష


ఏలేశ్వరం శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

ఏలేశ్వరం: పట్టణంలోని 18, 20 వార్డుల్లో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు శ్రీలక్ష్మి, పాపారావు ఆధ్వర్యంలో సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం రోగులకు ప్రజాప్రతినిధులు మందుల కిట్లు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, సుంకర రాంబాబు, తొండారపు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం


తునిలో కల్వర్టు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి

తుని: పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. స్థానిక 25వ వార్డులో రూ.20 లక్షలతో నిర్మించే కల్వర్టు పనులను బుధవారం ఆమె కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రజలకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పాముర్తి మహేష్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కౌన్సిలర్ కాసే సుమతి, కమిషనర్ ప్రసాదరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు


క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలిస్తున్న రోడ్డు సేఫ్టీ సిబ్బంది

గండేపల్లి: పదహారో నంబర్ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే... మండలంలోని మురారికి చెందిన ఎం.వెంకట్రావు, నాగలక్ష్మి దంపతులు మోటార్ సైకిల్‌పై జెడ్.రాగంపేట ఆదిత్య ఆస్పత్రి వద్ద డివైడర్ దాటుతుండగా రాజమహేంద్రవరం వైపు నుంచి విశాఖ వైపు వెళుతున్న మినీ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకట్రావుకు తీవ్ర గాయాలు కాగా నాగలక్ష్మికి స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలం వద్దకు చేరుకున్న రోడ్డు సేఫ్టీ సిబ్బంది వారిని స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించినట్టు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గండేపల్లి: హైవేపై బుధవారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైనట్టు స్థానిక పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే... శ్రీకాకుళం జిల్లా కన్నవరం గ్రామానికి చెందిన తైలం నాయుడు స్కూటీపై రాజమహేంద్రవరం వైపు వెళుతుండగా మండలంలోని ఎన్టీ రాజాపురం వద్ద ధాన్యం లోడు లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నాయుడు తలకు బలమైన గాయమైంది. సంఘటన స్థలానికి చేరుకున్న రోడ్డు సేఫ్టీ సిబ్బంది క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్య నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

రహదారిపైనే మురుగు


హైవేపై నిలిచిపోయిన వర్షం, మురుగు నీరు

గండేపల్లి: మండల వ్యాప్తంగా బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. కొద్దిపాటి వర్షానికే పలు గ్రామాల్లో రోడ్లపై, ఇళ్ల మధ్య మురుగు నీరు నిలిచిపోయింది. మండలంలోని నీలాద్రిరావుపేటలో మహాత్మగాంధీ విగ్రహానికి సమీపంలోని వీధుల్లో నీరు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో చిన్నపాటి వర్షం వచ్చినా నీరు నిలిచిపోతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ వీధుల్లో వర్షపు నీరు హైవే అడుగుభాగం నుంచి జెడ్.రాగంపేట సమీపంలో గల బావిశెట్టివాని చెరువులోకి వెళ్లేది. ప్రస్తుతం ఆ మార్గాన్ని మట్టితో నింపేయడంతో వర్షపు నీరు ఇళ్ల మధ్య, హైవేపై నిలిచిపోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కత్తిపూడిలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని కత్తిపూడి సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో బుధవారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు.

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు విద్యార్థినుల ఎంపిక


తరుణి


హేమలత

తుని: స్థానిక ఆదిత్య కళాశాలకు చెందిన విద్యార్థిని కలగా తరుణీ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ ఎండీ షాహిద్దీన్ బుధవారం తెలిపారు. ఇటీవల నన్నయ్య యూనివర్సిటీలో జరిగిన పోటీల్లో తరుణీ ప్రతిభ చూపి పోటీలకు అర్హత సాధించిందన్నారు. ఆమె త్వరలో విజయవాడలో జరిగే శిక్షణ శిబిరంలో పాల్గొంటుందని చెప్పారు. ఎంపికైన విద్యార్థినిని విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, కరస్పాండెంట్ ఎన్ సుగుణారెడ్డి, కో ఆర్డినేటర్ బీవీఈఎల్ నాయుడు అభినందించారు.

శ్రీప్రకాష్ విద్యార్థిని ఎంపిక

తుని: ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు స్థానిక శ్రీప్రకాష్ విద్యార్థిని పైలా హేమలత ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ కె.వీర్రాజు బుధవారం తెలిపారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఐదుగురు ఎంపిక కాగా వీరిలో హేమలత ఒకరన్నారు. ఈ నెల 10 వరకూ విజయవాడలో జరిగే శిక్షణ శిబిరంలో ఆమె పాల్గొంటుందన్నారు. ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికైన హేమలతను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ అభినందించారు.

ఆదర్శప్రాయుడు 'అమరజీవి'


తునిలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


కోటనందూరులో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు


ఏలేశ్వరంలో పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఘనంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం

తుని: ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు ఆదర్శనీయుడని వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు కొనియాడారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ ఆవతరణ దినోత్సవం నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఈఓపీఆర్డీ జి.అరుణ్‌కుమార్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. మండల పరిషత్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం

గోకవరం: ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని బుధవారం గోకవరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద పొట్టిశ్రీరాములు విగ్రహానికి సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్రరాష్ట్ర అవతరణకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బత్తుల నానాజీ, ముమ్మిడివరపు చినబాబు, కాజా రామ్‌కుమార్, మరిడిరాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



జగ్గంపేటలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం

ఏలేశ్వరం: ఆంధ్రప్రదేశ్ ఆవతరణ దినోత్సవాన్ని బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్, కోరాడ ప్రసాద్, పైల విజయ్‌కుమార్, వాసవి సేవదళ్ అధ్యక్షుడు గొల్లపూడి త్రిమూర్తులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: అమరజీవి పొట్టి శ్రీరాములును యువతకు ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, పరిపాలనాధికారి జె.శ్రీనివాస్ తదతరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీఓ వసంత కుమార్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

అమరవీరుల త్యాగాలు మరువలేం

జగ్గంపేట: విప్లవ అమరవీరుల త్యాగాలు మరువలేమని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. జగ్గంపేట శివారు రంగవల్లి నగర్‌లో బుధవారం విప్లవ అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తికోసం, పీడిత ప్రజల విముక్తి కోసం ప్రాణాలు అర్పించిన విప్లవ అమరవీరులను స్మరించుకుంటూ గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. తొలుత అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకుడు దేశెట్టి సురేష్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం


సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

తొండంగి: మండలంలోని బెండపూడిలో సాయిబాబా ఆలయ వార్షిక వేడుకలు బుధవారంతో ముగిశాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు సాయిబాబాకు ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, లక్ష పుష్పార్చన, పంచహారతులు తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక భక్తాంజనేయ భజన సమాజం మహిళలు భక్తిగీతాలు ఆలపించారు. అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు.

రామాలయ నిర్మాణానికి విరాళం

రౌతులపూడి: మండలంలోని లచ్చిరెడ్డిపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర సమన్వయ సారథి అనూష యాదవ్ రూ.25 వేలు విరాళం అందజేశారు. గతంలో గ్రామంలో పర్యటించిన ఆమెను రామాలయ అభివృద్ధికి సహకరించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు అనూష యాదవ్ ఆర్థిక సాయం అందజేశారు. వీలైనంత త్వరగా రామాలయ నిర్మాణం పూర్తి చేయాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. గ్రామస్తులు వీరబ్బాయి, దేవుళ్ల పాల్గొన్నారు.